సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 29 । జూలై । 2023



పులి గాండ్రింపులు ఏవీ?!
జిల్లాలో విస్తారంగా అటవీ ప్రాంతం ఉన్నా పులి జాడ లేదు. రెండేళ్లక్రితం ఓసారి అడుగుజాడలు కనిపించాయి. 8లో



ప్రభుత్వం ఉండగా..
వరద బాధితులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉం టుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
30° / 25°
జిల్లాలో శనివారం ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నది. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

రీజియన్‌లో పలు ఆర్టీసీ సర్వీసులు రద్దు

సంస్థకు రూ.10లక్షల నష్టం

ఖమ్మం మామిళ్లగూడెం: వరద ముంపునకు గురైన ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను శుక్రవారం రద్దు చేసింది. దీంతో రీజియన్‌లో ప్రతిరోజు రావాల్సిన రూ.95లక్షలకు గాను రూ.85 లక్షల ఆదాయమే రావడంతో రూ.10 లక్షల నష్టం ఎదురైంది. కాగా, ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల నుంచి 46 సర్వీసులను రద్దు చేయగా, దూర ప్రాంతాల బస్సులను మాత్రం యథావిధిగా నడిపించారు. భద్రాచలం డిపో నుంచి అత్యధికంగా 18 సర్వీసులను రద్దు చేయగా, కొత్తగూడెం డిపో నుంచి మూడు, సత్తుపల్లి డిపో నుంచి ఎనిమిది, మణుగూరు డిపో నుంచి ఐదు, మధిర డిపో నుంచి రెండు, ఖమ్మం డిపో నుంచి 10 సర్వీసులు తాత్కాలికంగా రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

మద్యం తీర్మానం వాయిదా

వరదల సమయాన గ్రామసభ ఏర్పాటుపై ఆగ్రహం

గుండాల: ఆళ్లపల్లి మండలం రాయిగూడెంలో మద్యం షాపు ఏర్పాటుకు శుక్రవారం నిర్వహించిన పీసా గ్రామసభను స్థానికులు అడ్డుకున్నారు. ఓ పక్క వరదలతో ఇబ్బంది పడుతుంటే సహాయక చర్యలు చేపట్టాల్సింది పోయి గ్రామసభకు రావడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆళ్లపల్లిలో మద్యం దుకాణం కోసం గ్రామ సభ నిర్వహించారు. ఈమేరకు రాయిగూడెం గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై సభను అడ్డుకుని, ప్రజా సమస్యల కన్నా మద్యం దుకాణానికే విలువ ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. వరదలతో పశువులు మృతి చెందగా, పంటలు నష్టపోయామని, నాలుగు రోజులుగా కరెంట్, తాగునీరు అందడం లేదని తెలిపారు. ఈసమయాన మద్యం షాపు ఏర్పాటుకు సభ ఏర్పాటు చేయడం సరికాదని, సర్పంచ్, పంచాయతీ అధికారులు జాడ లేకుండా పోయారని మండిపడ్డారు. దీంతో అబ్కారీ అధికారులు సభ వాయిదా వేసి వెనుదిరిగారు.

1,657 ఎకరాల్లో పంట నష్టం

దెబ్బతిన్న వరి, పత్తి, మొక్కజొన్న



గుండాలలో నీటమునిగిన మొక్కజొన్న

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారీ వర్షాలు, వరదలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం 57 గ్రామాల్లో 765 మంది రైతులకు సంబంధించి 1,657 ఎకరాల్లో పంటల నష్టం కలిగింది. వరి, పత్తి, మొక్కజొన్న పంటలు ధ్వంసమయ్యాయి. మణుగూరు, అశ్వారావుపేట, బూర్గంపాడు, గుండాల, ఆళ్లపల్లి, మణుగూరు, చర్ల, కొత్తగూడెం, జూలూరుపాడు, పాల్వంచ, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో నష్టం తీవ్రత ఉంది. గత నెలలో లోటువర్షపాతంలో సతమతమైన రైతులు ఈ నెలలో అధికవర్షపాతంతో పంటలు దెబ్బతిన్ని పెట్టుబడి నష్టపోయారు. బూర్గంపాడు మండలంలో 147 ఎకరాల్లో వరి, 364 ఎకరాల్లో పత్తి, గుండాల మండలంలో 321 ఎకరాల్లో పత్తి, 195 ఎకరాల్లో మొక్కజొన్న, ఆళ్లపల్లి మండలంలో 137 ఎకరాల్లో పత్తి, 134 ఎకరాల్లో మొక్కజొన్న, చర్లలో 76 ఎకరాల్లో వరి, 55 ఎకరాల్లో పత్తి, జూలూరుపాడులో 108 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నది. జిల్లావ్యాప్తంగా 57 గ్రామాల్లో 299 ఎకరాల్లో వరి, 1,029 ఎకరాల్లో పత్తి, 329 ఎకరాల్లో మొక్కజొన్న.. మొత్తం 1,657 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నామని, వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు తెలిపారు.



భద్రాచలం అర్బన్: భద్రగిరి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది (ఇన్‌సెట్) శుక్రవారం రాత్రి 12 గంటలకు 53.60 అడుగులకు చేరిన నీటిమట్టం



ఊరూవాడ గోదావరే..

భద్రాచలం వద్ద ప్రమాదకర స్థాయిలో వరద ప్రవాహం
- ఈ ఏడాది తొలిసారి మూడో ప్రమాద హెచ్చరిక జారీ
- వరద నీటితో ఏజెన్సీలో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ముంపు బాధితులను పునరావాస శిబిరాలకు తరలింపు
- మరో 24గంటలపాటు తీరం వెంబడి హైఅలర్ట్

భద్రాచలం: ఊహించినట్టుగానే భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఈ ఏడాది తొలిసారిగా మూడో ప్రమాద హెచ్చరికను దాటి ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వచ్చిన గోదావరి ఎగువన కురిసిన వర్షాలతో ప్రాజెక్టుల నుంచి వరద నీటిని విడుదల చేస్తుండగా భద్రాచలం వద్ద రాత్రి నది నీటిమట్టం 53 అడుగులను దాటింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేయడంతోపాటు హైఅలర్ట్ ప్రకటించారు. లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస శిబిరాలకు తరలిస్తున్నారు. మరో 24 గంటలపాటు గోదావరి తీరం వెంబడి ప్రాంత ప్రజలను, సిబ్బందిని జిల్లా అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

వేగంగా పెరుగుతున్న వరద

రెండు రోజులుగా స్వల్పంగా పెరుగుతూ, తగ్గుతూ వచ్చిన గోదావరి శుక్రవారం అతి వేగంగా పెరిగి రెండో, మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిని చేరుకుంది. ఉదయం 6 గంటలకు 46.20 అడుగులుగా ఉన్న గోదావరి 10 గంటలకు 11,44,645 క్యూసెక్కుల నీటి ప్రవాహం దిగువకు వెళ్తుండగా, నీటిమట్టం 48 అడుగులుగా నమోదైంది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. అంతే వేగంగా పెరుగుతూ సాయంత్రం 5 గంటలకు 51.40 అడుగులకు చేరింది. రాత్రి 8.43 గంటలకు 53 అడుగులకు చేరుకోగా అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 12 గంటలకు 14,54,937 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండగా, నీటిమట్టం 53.60 అడుగులుగా నమోదైంది.

గ్రామాలకు రాకపోకలు బంద్
- గోదావరి వరద నీరు ఏజెన్సీలో పలు చోట్ల ప్రధాన రహదారులపైకి రావడంతో గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. దుమ్ముగూడెం మండలంలో తూరుబాక, బుర్రవేముల ప్రధాన రహదారిపై నీరు చేరటంతో భద్రాచలం నుంచి ఆ మండలానికి వెళ్లే పరిస్థితి లేదు.
- బైరాగులపాడు, సున్నంబట్టి గ్రామాల నడుమ, పర్ణశాల గ్రామంలో వెళ్లే చోట్ల వరద నీరు చేరటంతో ఆయా గ్రామాలకు మండల కేంద్రం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి.
- చర్ల మండలంలో కుదునూరు, దేవరపల్లి గ్రామాల నడుమ, సుబ్బంపేట వద్ద ప్రధాన రహదారుల నడుమ గోదావరి వరద చేరటంతో ఇటు భద్రాచలం నుంచి చర్లకు, అటు చర్ల నుంచి వెంకటాపురం, వాజేడు మండలాలకు రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. కొత్తపల్లి, గండుపల్లి గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి.
- బూర్గంపాడు, రెడ్డిపాలెం మధ్య రోడ్డుపైకి నీరు చేరటంతో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. బూర్గంపాడు నుంచి కుక్కునూరు రోడ్డుకు, భద్రాచలం నుంచి నెల్లిపాక గ్రామాలకు రవాణా ఆగిపోయింది.
- అశ్వాపురం మండలంలో రామచంద్రాపురం, ఇరవెండి గ్రామాల మధ్య రహదారిపైకి గోదావరి వరద చేరటంతో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా అధికారులు హెచ్చరించినట్లు 60 అడుగులకు చేరితే ఏజెన్సీలో అనేక గ్రామాలకు రవాణా వ్యవస్థ స్తంభించిపోతుంది.

మరో 24 గంటలు హైఅలర్ట్

ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి వరద నీరు ఇంకా వచ్చే అవకాశం ఉండటంతో మరో 24 గంటలు గోదావరి తీర ప్రాంతాల వెంబడి అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సుమారు 2 లక్షల 58 క్యూసెక్కులు, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 9 లక్షల 11 వేలు, మేడిగడ్డ ప్రాజెక్టు నుంచి 13 లక్షల 17వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీరు శుక్రవారం అర్ధరాత్రి లేదా శనివారం భద్రాచలం చేరుకునే అవకాశం ఉందని, దీంతో 58 అడుగుల నుంచి 60 అడుగుల వరకు వరద చేరుకునే అవకాశం ఉందని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాల్లోని ముంపు గ్రామాల ప్రజలను ట్రాక్టర్ల ద్వారా పునరావాస శిబిరాలకు తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 30 రెవెన్యూ గ్రామాల నుంచి 3,077 కుటుంబాలకు చెందిన 9,798 మందిని పునరావాస శిబిరాలకు తరలించారు.



అశ్వాపురం: మొండికుంట-సారపాక ప్రధాన రహదారిపై చేరిన గోదావరి వరద



బూర్గంపాడు-భద్రాచలం రాష్ట్రీయ రహదారిపైకి చేరిన వరదనీరు



చర్ల: కొత్తపల్లి సమీపంలోకి చేరిన వరదనీరు

వెంటాడుతున్న భయం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని శిబిరంలో తలదాచుకున్న బాధితులు

- ముందుగానే పునరావాస శిబిరాలకు వెళ్తున్న జనం
- ఇంట్లో ఏ సామగ్రి వదలకుండా ఖాళీ
- గతేడాది వరదలకు తీవ్రంగా నష్టపోయిన ప్రజలు
- ముంపుప్రాంతవాసులకు పీడకలగా మారిన వరద



శిబిరంలో బాధితులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : గోదావరి తీరం వెంబడి ప్రజలకు వరద అంటే వెన్నులో వణుకు పుడుతోంది. గతేడాది వేదనానుభవం ఇప్పటికీ వెంటాడుతోంది. వరద వస్తోందని అధికారులు చెప్పగానే జనమే స్వచ్ఛందంగా శిబిరాలకు తరలివెళ్తున్నారు.

మాయమైన ధీమా

గోదావరి తీర ప్రాంత ప్రజలకు వరద కొత్తకాదు. ప్రతీ ఏడాది చూసేదే. గోదావరికి వరద పోటెత్తడం మూడో ప్రమాద హెచ్చరిక దాటితే పల్లపు ప్రాంతాల్లోకి నీరు రావడం తెలుసు. చివరిదైన మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసినా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నివాసాల ముంగిళ్ల వరకు నీళ్లు వస్తాయి. అంతకు మించి అరవై అడుగుల వరద వస్తే ఇళ్లలో నడుములోతు నీళ్లొస్తాయి. ఇంతోటి దానికి ఇళ్లను, ఇంట్లోని సామగ్రి వదిలి బయటకు వెళ్లేందుకు ఎవరూ సుతారము ఇష్టపడేవారు కాదు. వరద వస్తోంది, ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాలకు రండంటూ అధికారులు పదే పదే చెప్పినా ఇళ్లు వదలేందుకు ఇష్టపడేవారు కాదు. గతేడాది కూడా అరవై అడుగుల వరద వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్పినా... ముంపు ప్రాంతంలో ఉండే సగం కుటుంబాలు బయటకు రాలేదు. చివరకు పోలీసులు బలవంతంగా తరలించాల్సి వచ్చింది. దీంతో కొందరు ఇళ్లలోని సామాన్లు సజ్జల మీద, అటకల పైకి చేర్చి వరద సహాయ శిబిరాలకు చేరారు. గంటో, రెండో గంటలో అక్కడుంటాం, లేదంటే ఒక పూట, మహా అయితే ఒక రాత్రి అక్కడుంటి వచ్చేద్దాం అన్నట్టుగా శిబిరాలకు వెళ్లారు. కానీ ఒక్క రోజులో పరిస్థితి తారుమారైంది.

కట్టుబట్టలతో మిగిలారు

2022 జూలై 14న అర్ధరాత్రి వచ్చిన వరద, గోదావరి తీరంలోని ముంపు ప్రాంత ప్రజలకు అప్పటివరకు ఉన్న అభిప్రాయాలను పటాపంచలు చేసింది. 71 అడుగులకు పైగా వచ్చిన వరద ఇళ్లు కనిపించకుండా లోతట్టు ప్రాంతాలను ముంచేసింది. మునిగినా బయటపడేందుకు నాలుగు రోజులకు పైగా సమయం పట్టింది. ఆ ఇళ్లలో గల్లా గురుగులో దాచుకున్న సొమ్ముల నుంచి టీవీలు, ఫ్రిడ్జ్‌లు, ఏసీలు, వాషింగ్ మెషిన్లు ఏవీ పనికి రాకుండా నీళ్లలో నాని పాడైపోయాయి. లోతట్టు ప్రాంత ప్రజలు కట్టుబట్టలతో మిగిలారు.

స్వచ్ఛందంగా.. సంపూర్ణంగా..

వారంపది రోజులుగా గోదావరికి వరద వస్తోంది. వరద మాట వింటేనే లోతట్టు ప్రాంత ప్రజల గుండెలు గుభేల్‌మంటున్నాయి. గతంలో అరవై అడుగులు వచ్చినా ఇళ్లు దాటని జనాలు ఇప్పుడు యాభై అడుగులు దాటిందంటేనే శిబిరాల వైపు చూస్తున్నారు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో మూడో ప్రమాద హెచ్చరికైన 53 అడుగులకు వరద రావొచ్చని ప్రకటన రాగానే చర్ల, దుమ్ముగూడెం, అశ్వాపురం, మణుగూరు, బూర్గంపాడు, భద్రాచలంలో ముంపు ప్రాంతాల ప్రజలు తమకు తాముగా శిబిరాలకు చేరుకోవడం ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే ట్రాక్టర్లు వచ్చేవరకు ఎదురు చూడకుండా ఇళ్లు ఖాళీ చేస్తున్నారు. గతంలో సామాన్లు అటక ఎక్కించి, రెండు జతల బట్టలతో కదిలేవారు. కానీ ఈసారి పూర్తి సామాన్లతో ఇళ్లు ఖాళీ చేస్తున్నారు. ఆఖరికి ఇళ్లలో ఉండే విద్యుత్ బల్బులను కూడా వదిలి వెళ్లడం లేదు.

ఆటోవాలా సేవలు..

భద్రాచలం పట్టణంలో ట్రాలీ ఆటో కిరాయికి రావాలంటే కనీసం రూ.700 చెల్లించాలి. డిమాండ్ ఎక్కువగా ఉంటే ఈ కిరాయి వెయ్యి రూపాయల వరకు చేరుతుంది. కానీ ఈసారి ఆ పరిస్థితి లేదు. గతేడాది వరద మిగిల్చిన విషాదంతో ఆటోవాలలు ఈ సారి కిరాయిలు తగ్గించారు. ఇంటి తరలింపునకు ఇంత అని ఎవరూ డిమాండ్ చేయడం లేదు. సాటి వారికి సాయం చేయడమే లక్ష్యంగా సేవలందిస్తున్నారు. మరికొందరు తమకున్న ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్లలో బంధువులు, పరిచయస్తుల సామాన్లను తరలిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఈ తరహా పరిస్థితులు గోదావరి తీర ప్రాంతంలో కనిపించాయి. కాగా పునరావాస శిబిరంలో పిల్లలు సరదాగా ఆడుకుంటూ కనిపించారు.

బల్బు కూడా వదల్లేదు



గతేడాది మా బాబుకు పెళ్లైంది. ఆ వెంటనే వరద రావడంతో సామానంతా ఇంట్లోనే పెట్టి శిబిరాలకు వెళ్లాం. వచ్చి చూసే సరికి బియ్యం, మంచాలు, పరుపులు, టీవీలు, పెళ్లి సామాన్లు అన్ని నీళ్లలో మునిగి పనికిరాకుండా పోయాయి. రూ.2.50 లక్షల నష్టం వాటిల్లింది. కనీసం ప్రభుత్వం అందించే రూ.10 వేల సాయం కూడా దక్కలేదు. అందుకే ఈ సారి ఇళ్లంతా ఖాళీ చేసి వెళ్తున్నాం. బల్బు కూడా ఉంచడం లేదు. –షేక్ ఖతీజా బేగం

వడ్డీలు కడుతున్నా



నిరుడు వచ్చిన వరదలకు ఇంటిలో ఉన్న వాషింగ్ మెషిన్, కూలర్లు, ఫ్రిడ్జ్‌లు అన్నీ తడిచి పోయాయి. రిపేర్ చేయించుకునేందుకు వీలు లేకుండా పాడయ్యాయి. స్క్రాప్ కింద పదివరకు అమ్ముకున్నాం. కొత్త సామాన్లు కొనేందుకు అప్పులు చేయాల్సి వచ్చింది. ఇప్పటికీ ఆ అప్పులు తీరలేదు. వడ్డీలు కడుతూనే ఉన్నాం. మరోసారి వరదలో చిక్కుకుంటే ఇక కోలుకోలేం. అందుకే ముందుగానే కుటుంబం, రెండు నెలల మనుమరాలితో సహా శిబిరాలకు వెళ్తున్నాం. – ఖాదర్

అప్రమత్తతతోనే ముంపు రక్షణ

ఇల్లెందు సబ్ డివిజన్‌లో పర్యటించిన ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

ఇల్లెందు/గుండాల: వరద ముంపునకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి శుక్రవారం ఆయన ఇల్లెందు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. కేసుల నమోదు, విచారణపై ఆరా తీశాక సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ వరద ముంపు ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా జాగ్రత్త వడాలని సూచించారు. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసులు కృషి చేయాలని తెలిపారు. అలాగే, ఐజీ, ఎస్పీలు గుండాల, కాచనపల్లి పోలీస్‌స్టేషన్లను కూడా తనిఖీ చేసి పోలీసులుకు సూచనలు చేశారు. గుండాల– సాయనపల్లి ప్రాంతాల్లో కిన్నెరసాని నది, మల్లన్నవాగు వల్ల ముప్పు ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఆతర్వాత గుండాల మండలం ముత్తాపురంలో 12 మందిని కాపాడిన ఐదు గురు గజ ఈతగాళ్లను అభినందించి నగదు బహుమతి అందజేశారు. డీఎస్పీ ఎస్.వీ.రమణమూర్తి, సీఐలు కరుణాకర్, రవీందర్, ఎస్‌ఐలు రాజశేఖర్, గిరిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

స్వర్ణకవచధారణలో రామయ్య


భద్రాచలం: భద్రాచల రామాలయంలోని స్వామివారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచ ధారణలో దర్శనమివ్వడంతో భక్తులు పరమానంద భరితులయ్యారు. బేడా మండపంలో కొలువుదీరిన శ్రీసీతారామ చంద్రస్వామికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపారు. ఆ తర్వాత కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాంబాబు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పి.రాంబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంకను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని, పర్యవేక్షణ చేయాలని సూచించారు.

■ పెదవాగు ప్రాజెక్ట్‌కు భారీగా వరద

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరుతోంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో వాగుల నుంచి ప్రాజెక్టులోకి వరద ఉధృతి పెరిగింది. ప్రాజెక్ట్ నీటిమట్టం 12.6 అడుగులకు చేరినట్లు ఏఈ కేఎస్‌బీ కృష్ణ తెలిపారు.





■ వరద సహాయక చర్యలకు హెలికాప్టర్

బూర్గంపాడు: గోదావరి వరద సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక హెలికాప్టర్‌ను ఏర్పాటు చేసింది. సారపాకలోని ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో శుక్రవారం అందుబాటులో ఉంచగా, అత్యవసర సమయంలో వినియోగిస్తామని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు.

అధికార యంత్రాంగం సిద్ధం..

- శనివారం తెల్లవారుజాము వరకు 56 అడుగులకు చేరే అవకాశం
- ముమ్మరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- 22 కేంద్రాల్లో గోదావరి వరద ముంపు బాధిత కుటుంబాలు
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ ప్రియాంక అల

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద శుక్రవారం రాత్రికి గోదావరి నీటిమట్టం 56 అడుగులకు చేరే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లతో జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. భద్రాచలం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముంపునకు గురయ్యే 30 గ్రామాల ప్రజల కోసం 45 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటికే 22 కేంద్రాలకు బాధితులు చేరుకున్నారని వివరించారు. ఎవరూ ఇబ్బందులు పడకుండా వసతి, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గోదావరి 60 అడుగులకు చేరినా ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పునరావాస కేంద్రాల్లో ఏడు రోజులకు సరిపడా నిత్యావసరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాత్రి సమయంలో ఎటువంటి సమస్య తలెత్తినా ఎదుర్కొనేందుకు మూడు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో పాటు పది నిమిషాల్లో చేరుకునేలా హెలికాప్టర్‌ను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు ఎవరూ గోదావరి తీరానికి వెళ్లొద్దని తెలిపారు. జిల్లాలో వరదల కారణంగా ఎక్కడ జాతీయ, రాష్ట్రీయ రహదారులు దెబ్బతినలేదని చెప్పారు. జిల్లా, స్థానిక అధికారులు నిత్యం అందుబాటులో ఉన్నారని వరదలతో ఎటువంటి సమస్య వచ్చిన కంట్రోల్ రూమ్ నెంబర్లకు, లేదా స్థానిక అధికారులుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ట్యాంక్ బండ్ పనులు త్వరితగతిన చేపట్టాలి

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలో చింతల చెర్వు కట్టపై ఇటీవల మంజూరైన ట్యాంక్ బండ్ పనులను సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. శుక్రవారం పాత పాల్వంచ చింతలచెర్వు కట్టను పరిశీలించారు. ఆయకట్టు విస్తీర్ణం, నీటి నిల్వ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగా ప్రసాద్, కమిషనర్ అజ్మీర స్వామి, డీఈ మురళి, ఏఈ రాజేశ్, టీపీవో సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈ రాణి, ఎస్‌ఐ రాఘవయ్య సిబ్బంది పాల్గొన్నారు.



చింతల చెర్వును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

క్లుప్తంగా

శ్రీకనకదుర్గమ్మతల్లికి పంచామృతాభిషేకం



పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మతల్లికి శుక్రవారం అర్చకులు వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. పెద్దమ్మతల్లి ఆలయంలో ముందుగా మేళతాళాలతో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అభిషేకం అనంతరం పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు పాల్గొన్నారు.

1న చండీహోమం

పెద్దమ్మతల్లి ఆలయంలో వచ్చే నెల 1న పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమపూజలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కోతకు గురైన రహదారి పునరుద్ధరణ




మరమ్మతు పనులు చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కరకగూడెం: భారీ వర్షాల మూలంగా మండలంలోని బంగారుగూడెం ప్రధాన రహదారిపై గల బ్రిడ్జి ఇరువైపులా కోతకు గురైందని శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కోతకు గురైన రహదారిని టిప్పర్లతో గ్రావెల్ తోలి జేసీబీ ద్వారా సరిచేశారు. అనంతరం వాహనాల రాకపోకలను అనుమతించారు. వరదల ప్రభావంతో మండలంలో కోతకు గురైన రహదారులకు ఇదేవిధంగా మరమ్మతులు చేసిన తర్వాత పూర్తిస్థాయిలో రాకపోకలను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

'కాపీ టు ఎమ్మెల్యే' లేకుండానే..



కౌన్సిల్ ఎజెండా మొదటి పేజీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 31వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో జరుగనుంది. ఇందు కోసం మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు ఎజెండా కాపీలను శుక్రవారం అందజేశారు. అయితే, ప్రతీసారి ఎజెండా కాపీ మొదటి పేజీలో కాపీ టు ఎమ్మెల్యే, వైస్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు అని ముద్రించి వారికి అందజేసేవారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కాపీ టు ఎమ్మెల్యే అని ముద్రించకుండా మిగిలిన వారి పేర్లు, హోదాలతో ముద్రించడం విశేషం.

వరద బాధితులకు అండగా 'రెడ్‌క్రాస్'

భద్రాచలంఅర్బన్: గోదావరి వరదతో నష్టపోయిన వారికి అండగా నిలవాలన్న గవర్నర్ తమిళిసై సూచనలతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ బాధ్యులు రంగంలోకి దిగారు. భద్రాచలంలో సమావేశమైన వారు వరదలతో పూర్తిగా ఇళ్లు కూలిపోయిన వారికి టార్పాలిన్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. అలాగే, నష్టపోయిన వారు పేర్లు నమోదుకు హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటుచేయగా, 73307 79297, 94947 28027 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. డాక్టర్ ఎస్ఎల్.కాంతారావు, జిల్లా కోఆర్డినేటర్ వై.సూర్యనారాయణ, ఎ.రాజారెడ్డి, టి.సిద్ధులు, ఎ.జగదీష్, చావా లక్ష్మీనారాయణ, దేనప్ప, భానుప్రసాద్, వెంకటరెడ్డి, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

విచారణకు కోర్టు ఆదేశం

అశ్వాపురం: మోసం చేసిన వ్యక్తిపై విచారణ చేయాలని మణుగూరు కోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. వివరాలు ఇలా.. భారజల కర్మాగారంలో పనిచేస్తున్న సోమందుల వెంకటేశ్వర్లు, నక్కా వినయ్ సాగర్ మిత్రులు. ఇద్దరూ కలిసి బయ్యారం మండలంలో ఎకరం భూమి కొనుగోలు చేశారు. కొంతకాలం తర్వాత వెంకటేశ్వర్లు, అతని భార్య సంతకాలు ఫోర్జరీ చేసిన వినయ్‌సాగర్ భూమిని వేరొకరికి విక్రయించాడు. దీంతో బాధితుడు కోర్టులో ప్రైవేటు పిటీషన్ దాఖలు చేయగా, విచారణ చేపట్టాలని అశ్వాపురం పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

ప్రభుత్వం అండగా ఉంటుంది..

- వరద బాధితులకు ప్రభుత్వ విప్ రేగా భరోసా
- పునరావాస శిబిరాలను సందర్శించిన ఎమ్మెల్యే పొదెం వీరయ్య, అధికారులు



బాధితులతో మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు



సామగ్రి తరలిస్తున్న ఓఎస్డీ సాయిమనోహర్



పర్ణశాల గ్రామంలో ఆర్డీఓ మాధవి, అధికారులు

బూర్గంపాడు: వరద బాధితులెవరూ అధైర్య పడొద్దని, ప్రభుత్వం బాధితులకు అన్నివిధాలా అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు భరోసానిచ్చారు. గోదావరి వరద ముంపు ప్రాంతాలైన బూర్గంపాడు, నాగినేనిప్రోలు, సారపాక, మోతె, ఇరవెండి గ్రామాల్లో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. బూర్గంపాడులోని కస్తూర్బా పాఠశాలలో, సారపాకలోని బీపీఎల్ స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎప్పటికప్పుడు ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించాలని, కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భోజనం, వైద్యం అందించాలని సూచించారు. ముంపు గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని, బాధితులకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు సహాయ, సహకారాలను అందించాలని పేర్కొన్నారు. రెస్క్యూ టీమ్‌లు, గజఈతగాళ్లు, పడవలను అందుబాటులో ఉంచుకోవాలని, పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావుతోపాటు గోపిరెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.

ముంపు కాలనీల సందర్శన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో వరద ముంపు బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను శుక్రవారం సందర్శించిన జిల్లా ఓఎస్డీ సాయి మనోహర్, టౌన్ సీఐ నాగరాజు.. తర్వాత ముంపునకు గురయ్యే కాలనీలను సందర్శించారు. కాలనీవాసులను త్వరగా పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ప్రజలు అధికారులకు సహకరిస్తే వరద కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా నివారించవచ్చని తెలిపారు.

జాగ్రత్తలు తీసుకోండి..

దుమ్ముగూడెం: గోదావరి వరద గంటగంటకూ పెరుగుతున్న నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వరదల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మండల అధికారులను ఆర్డీఓ మాధవి, భద్రాచలం ఏఎస్పీ పరితోజ్ పంకజ్ ఆదేశించారు. శుక్రవారం పర్ణశాలలో వారు వేర్వేరుగా పర్యటించారు. గోదావరి వరద మూడో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించనున్న నేపథ్యంలో గోదావరి ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు వెంటనే చేపట్టాలని, ఎక్కడ కూడా నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీఐ దోమల రమేశ్, తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ ముత్యాలరావు, మండల ప్రత్యేకాధికారి మరియన్న పాల్గొన్నారు.

పునరావాస శిబిరాలను సందర్శించిన ఎమ్మెల్యే



కాలనీవాసులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వీరయ్య

భద్రాచలం: డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య పట్టణంలోని గోదావరి పునరావాస శిబిరాలను శుక్రవారం సందర్శించారు. గిరిజన అభ్యుదయ భవన్, నన్నపనేని మోహన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాలకు తరలించిన ముంపుకాలనీ వాసులను పరామర్శించారు. అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు రవికుమార్, కాంగ్రెస్ నాయకులు బోగాల శ్రీనివాసరెడ్డి, సరెళ్ల వెంకటేశ్, తరుణ్‌మిత్ర, పందాల సరిత తదితరులు పాల్గొన్నారు.

అంతా అప్రమత్తంగా ఉండాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



ముత్తాపురంలో ముంపు బాధితులతో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

గుండాల: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరద ముప్పు పొంచి ఉన్నందున ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. మండలంలోని వరద ముంపు ప్రాంతాలను శుక్రవారం పరిశీలించిన ఆయన కిన్నెరసాని ఉధృతి, ముంపునకు గురైన వారితో మాట్లాడారు. అలాగే, ప్రజలు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

స్థానికంగా ఉండని ఉపాధ్యాయులకు షోకాజ్‌లు

మండలంలోని ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తూ స్థానికంగా ఉండని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీఓ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మామకన్ను, కాచనపల్లి బాలికల క్రీడా పాఠశాలలను సందర్శించిన సమయంలో ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

వరదలో కొట్టుకుపోయిన కారు

భద్రాచలంటౌన్: గోదావరి వరద ఉధృతిలో శుక్రవారం సాయంత్రం ఓ కారు కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. తెలంగాణ, ఆంధ్ర సరిహద్దులోని రాయన్నపేట సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీటిలోకి వెళ్లిన కారు కొట్టుకుపోగా అందులోని నలుగురు వ్యక్తులను స్థానికులు కాపాడారు. కారు మాత్రం వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. కారులోని వ్యక్తులు చింతూరు నుంచి భద్రాచలం వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

వరదలతో ఎవరికీ నష్టం జరగొద్దు..

భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోజ్

చర్ల: గోదావరి వరదల వల్ల ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోజ్ సూచించారు. శుక్రవారం చర్ల మండలంలోని గోదావరి ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. స్థానిక పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముంపు ప్రాంతాల్లో ఎవరూ తిరుగకుండా చూడాలని, నీట మునిగిన రహదార్లపై ప్రయాణాలు సాగకుండా సురక్షిత మార్గాల ద్వారా ప్రజలు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వీరాపురం, జీపీపల్లి, మొగళ్లపల్లి, లింగాపురం, గొంపల్లి గ్రామాల్లో ఆయన ముంపు బాధితులతో మాట్లాడారు. ఎలాంటి సాయం కావాలన్నా డయల్ 100కు ఫోన్ చేయాలని, వాట్సాప్ ద్వారా లొకేషన్ పంపించాలని చెప్పారు. ఆయన వెంట చర్ల సీఐ అశోక్, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.



జీపీపల్లిలో వరద పరిస్థితిపై అడిగి తెలుసుకుంటున్న ఏఎస్పీ, అధికారులు

పునరావాస కేంద్రంలో కలెక్టర్ తనిఖీ



లోతట్టు ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆకస్మిక తనిఖీ చేశారు. ఏర్పాట్లు, సౌకర్యాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర వైద్య కేంద్రాన్ని సందర్శించి, పాము, తేలు వంటివి కుడితే మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం ఎస్సీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్ల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని చెప్పారు. ఆ తర్వాత ఎస్సీబీ నగర్‌లో పర్యటించి వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

వరద ఉధృతి వంతెనలపై ప్రయాణించొద్దు

చుంచుపల్లి: వర్షాలు, వరదల నేపథ్యంలో లో లెవల్ వంతెనలపైనుంచి ప్రయాణించొద్దని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. శుక్రవారం చుంచుపల్లి మండలం పెనుబల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గోధుమ వాగు వంతెనను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రమాదకరమైన వంతెల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రమాద స్థలాల్లో సెల్ఫీలు దిగడానికి వెళ్తే పోలీస్ కేసులు నమోదు చేయాలన్నారు. పిల్లలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జి.మధుసూదన్ రాజు, డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష, జెడ్పీ సీఈఓ మెరుగు విద్యాలత, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, న్సిపల్ కమిషనర్ రఘు, తహసీల్దార్లు వనం కృష్ణ ప్రసాద్, శర్మ, ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, సర్పంచ్ రెడ్డి శ్రీను, కార్యదర్శి కార్తీక్, డీఎస్పీ రెహమాన్, సీఐ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన మహిళ విగతజీవిగా..

మామిళ్లగూడెం శివారు వాగులో సీత మృతదేహం గుర్తింపు



సీత (ఫైల్)

ములకలపల్లి: పాములేరు వాగు వరద ఉధృతికి గల్లంతైన మహిళ కుంజా సీత (60) ఆచూకీ లభించింది. మామిళ్లగూడెం గ్రామశివారులోని వాగులో సీత మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. కుమ్మరిపాడు గ్రామానికి చెందిన మహిళా బృందం వరినాటు వేసేందుకు బుధవారం చాపరాలపల్లి వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పాములేరువాగు లోలెవెల్ చప్టాపై వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో వారంతా ఒకరిచేయి ఒకరు పట్టుకుని వాగు దాటుతున్నారు. ప్రవాహ ఉధృతికి తల్లీ, కూతుర్లు కుంజా సీత, కుర్సం జ్యోతి కొట్టుకుపోయారు. జ్యోతి ఓచెట్టు కొమ్మ పట్టుకోగా స్థానికులు కాపాడారు. కానీ, సీత జాడ దొరకలేదు. అప్పడి నుంచి పోలీస్, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు గాలింపు ముమ్మరం చేశారు. ఘటనా ప్రదేశానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో వాగులోని పొదల్లో సీత మృతదేహాన్ని గుర్తించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి కూతురు జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

పశువుల చోరీ నిందితుడి పట్టివేత

పోలీసులకు అప్పగింత

అశ్వారావుపేటరూరల్: పశువుల్ని అపహరిస్తున్న ముఠాలోని ఓ వ్యక్తిని శుక్రవారం గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం గ్రామంలోని పశువులు విక్రయించే మధ్యవర్తి అయిన దైద వెంకటేశ్ దగ్గరకు వినాయకపురం గ్రామానికి చెందిన సున్నం రాంబాబు, ముత్యాల సుధాకర్ ఓ ఆవును తీసుకొచ్చి విక్రయించేందుకు బేరం ఆడుతున్నారు. కాగా, వారి ప్రవర్తనపై అనుమానం వచ్చిన కొంతమంది గ్రామస్తులు ఆవు గురించి ప్రశ్నించి నిలదీశారు. దాంతో మధ్యవర్తితోపాటు వారిద్దరూ ఆవును అక్కడే వదిలేసి పారిపోయారు. వెంబడించిన గ్రామస్తులు వారిలో సున్నం రాంబాబు అనే వ్యక్తిని పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసుల విచారణలో చోరీకి గురైన ఆవు అశ్వారావుపేట మండలంలోని దబ్బతోగు గ్రామానికి చెందిన కొవ్వాసి మల్లమ్మకు చెందినదిగా గుర్తించి ఆమె సమాచారం ఇచ్చారు. బాధితురాలు మల్లమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.శ్రీకాంత్ తెలిపారు. పారిపోయిన మరో ఇద్దరిని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ అన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



గాలీబ్‌పాషా (ఫైల్)

చండ్రుగొండ: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం శుక్రవారం మండలంలోని తిప్పనపల్లి బ్రిడ్జి వద్ద వాగులో లభించింది. వ్యక్తి అదృశ్యం శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 27న కథనం ప్రచురితమైన విషయం విదితమే. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. అయన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్కే గాలీబ్‌పాషా (33) ఈ నెల 26న భార్యతో గొడవపడి బయటకు వెళ్లాడు. సాయంత్రం సీతాయిగూడెం ఎడుళ్లవాగు బ్రిడ్జి వద్ద అతడి ద్విచక్రవాహనంతోపాటు చెప్పులు లభించాయి. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు మూడురోజులుగా అతడి జాడ కోసం వాగు వెంట వెతుకుతుండగా అతడి మృతదేహం తిప్పనపల్లి వద్ద వాగులో లభించింది. మృతుడికి భార్య గౌసియాబేగం, పిల్లలు సమీర్, సల్మాన్, సోహేల్ ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గొల్లపల్లి విజయలక్ష్మి తెలిపారు. కాగా, గాలిబ్‌పాషా మృతితో అతడి తల్లిదండ్రులు, భార్య, పిల్లలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వారి పరిస్థితి దయనీయంగా మారింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని తిమ్మినేనిపాలెంలో ఇటీవల పురుగుల మందు తాగిన కొమ్ము ప్రభాకర్(34) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభాకర్ జీవితంపై విరక్తి చెంది బుధవారం పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా, కేసునమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

యువతి ప్రేమించడం లేదని ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చింతకాని మండలం నాగులవంచకు చెందిన కొల్లు శ్రీను(22) ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఓ యువతిని ప్రేమిస్తుండగా, ఆమె ప్రేమించటం లేదనే మనస్తాపంతో పురుగుల మందు తాగి చెరువు బజార్‌లో ఉంటున్న తన సోదరుడు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి పడిపోయాడు. దీంతో శ్రీనును ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

పులి గాండ్రింపులు ఏవీ?!

- జిల్లాలో రెండేళ్ల క్రితం కనిపించిన అడుగుజాడలు
- అత్యధిక అటవీ విస్తీర్ణం ఉన్నా కానరాని పులి

నేడు ప్రపంచ పులుల దినోత్సవం



పాల్వంచరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తారంగా అటవీ ప్రాంతం ఉన్నా పులులు కన్పించకుండా పోయాయి. జాతీయ జంతువైన పులుల నివాసానికి జిల్లా అడవులు అనువైనవే అయినా... మనుగడ సాగడం లేదు. రెండేళ్లక్రితం ఓసారి జిల్లా అటవీ ప్రాంతంలో పులుల అడుగుజాడలు కనిపించాయి. కానీ ఆతర్వాత మళ్లీ జాడ లేదు. జిల్లా అటవీ విస్తీర్ణం 4,33,446 హెక్టార్లు కాగా, ఇందులో కిన్నెరసాని అభయారణ్యం విస్తీర్ణం 634.4 చదరపు కిలోమీటర్లుగా ఉంటుంది. అటవీప్రాంతంలో గుత్తికోయలు నివాసం ఏర్పాటుచేసుకోవడం, పోడు సాగుకు అడవులు నరికివేయడంతో పాటు రహదారుల నిర్మాణంతో పులుల మనుగడ కష్టమవుతోందనే భావన వ్యక్తమవుతోంది. శనివారం ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో పులుల మనుగడ, రాకపోకలు, నివాసం ఏర్పాటుచేసుకోకపోవడానికి గల కారణాల పై కథనం.

గతంలో పులుల కదలికలు

2001 సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడు పులుల అడుగు జాడలను అధికారులు గుర్తించారు. ఇక 2005లో మూడు, 2008లో నాలుగు, 2011, 2012లో మూడేసి పులులు, 2013లో రెండు, 2014, 2015లో ఒక్కో పులి కనిపించినా ఆతర్వాతజాడలేదు. 2018లో చేపట్టిన పులుల గణనలో ఉమ్మడి జిల్లా అటవీ ప్రాంతంలో ఎక్కడా పులిని గుర్తించలేకపోయారు.

వలన వచ్చినట్లే వచ్చి...

జిల్లా అడవుల్లోకి పులుల వలస వస్తున్నాయి. జిల్లా అటవీ ప్రాంతాని ఆనుకుని ఏపీలోనిపాపికొండలు, అటు ఛత్తీస్‌గఢ్, ఇటు ఏటురూనాగారం అటవీ ప్రాంతాలు ఉండటంతో పెద్దపులులు అతిథులుగా వచ్చివెళ్తున్నాయే తప్ప స్థావరం ఏర్పాటుచేసుకోవడం లేదు. 2020 నవంబర్, 2021 డిసెంబర్, జనవరి నెలల్లో పెద్ద పులులు జిల్లా అటవీ ప్రాంతంలో సంచరించాయి. ఇక్కడ కిన్నెరసాని అభయారణ్యం పెద్దపులులకు సంరక్షణగా అనువుగా ఉన్నా పులులు మాత్రం ఉండడం లేదు.

అనేక కారణాలు

పొరుగు రాష్ట్రాల నుంచి గోదావరి నది దాటి జిల్లా అటవీప్రాంతానికి పెద్దపులులు అప్పుడప్పుడు వస్తున్నా స్థిర స్థావరం ఏర్పాటుచేసుకోవడం లేదు. అటవీప్రాంతం ఉన్నా పులులకు కావాల్సిన శాఖాహార జంతువులైన జింకలు, దుప్పులు, సాంబార్ వంటి జంతువుల సంఖ్య తక్కువగా ఉండడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో గుత్తికోయ గుంపులు విస్తరించడం, అడవుల్లోనూ రహదారుల నిర్మాణం కూడా ఇంకో కారణం కావొచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

పులి ఉండాలంటే..

జిల్లా అటవీ ప్రాంతంలో పులులు మనగడ కొనసాగించాలంటే వాటికి ఆహారమైన దుప్పులు, కణుజులు, సాంబారులు అధికంగా ఉండాలి. అవి అధికంగా ఉన్నచోట పెద్దపులి నివాసం ఉండే అవకాశం ఉంటుంది. అయితే జిల్లా అటవీ ప్రాంతంలో జింకలు ఉన్నా ఎక్కువ లేవు, ఉన్నవాటిని అటవీ ప్రాంతంలోగుత్తికోయ గిరిజనులు మాయం చేస్తున్నారని ఫారెస్టు అధికారులు అంటున్నారు.

పులి సంరక్షణపై దృష్టి పెట్టాం



జిల్లా అటవీ ప్రాంతానికి పెద్దపులుల వచ్చివెళ్తున్నాయి. అభయారణ్యంతో పాటు ఇతర అనువైన దట్టమైన అటవీ ప్రాంతం కూడా ఇక్కడ ఉంది. పులుల సంరక్షణతోపాటు అడవి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. వరల్డ్ టైగర్ డే సందర్భంగా శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– కృష్ణాగౌడ్, డీఎఫ్ఓ, భద్రాద్రి కొత్తగూడెం

పెద్దపులి ఆవాసానికి అనువే...



పెద్దపులి నివాసానికి కిన్నెరసాని అభయారణ్యం అనువుగా ఉంది. ఇక్కడ రెండు పెద్దపులులు సంచరిస్తూ రెండేళ్ల క్రితం ట్రాప్ కెమెరాకు చిక్కాయి. ఒక ఎద్దుపై దాడి చేస్తే మృతి చెందడంతో రైతుకు నష్టపరిహారం చెల్లించాం.

– కట్టా దామోదర్‌రెడ్డి, ఎఫ్‌డీఓ, వన్యప్రాణి సంరక్షణ విభాగం

పదోన్నతులు.. పోస్టింగ్

ఖమ్మం సహకారనగర్: పలువురు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు రఘునాథపాలెం తహసీల్దార్ జి.నర్సింహారావుకు పదోన్నతి దక్కగా, ఆయనను నల్లగొండలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్ అండ్ ఆర్ (ఎల్ఏ) యూనిట్–2గా నియమించారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ఖమ్మం రూరల్, చింతకాని, తల్లాడ తహసీల్దార్లకు కూడా డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభించనుంది. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.అశోక్ చక్రవర్తికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించటంతో ఆయనను కల్లూరు ఆర్డీవోగా నియమించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న బి.శివాజీని మైనార్టీ వెల్ఫేర్ శాఖ బదిలీ చేశారు.

సామూహిక లైంగికదాడిని ఖండించండి

మావోయిస్టు చర్ల, శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ

చర్ల: మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలపై బ్రాహ్మణీయ మనువాద ఆర్ఎస్ఎస్, బీజేపీ, ఉగ్రమూకలు జరిపిన సామూహిక లైంగికదాడిని తీవ్రంగా ఖండించాలని, ర్యాలీలు, ధర్నాల రూపంలో ఆందోళనలను నిర్వహించాలని మావోయిస్టు చర్ల, శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, మోదీ, అమిత్‌షాలు మణిపూర్ ఘటనలకు పూర్తి బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం ప్రకారం పాలన కొనసాగుతోందా? లేక కాలంచెల్లిన బ్రాహ్మణీయ మనువాదం ప్రకారం సాగుతోందా? అనేది దేశ ప్రజలకు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జవాబు ఇవ్వాలని, మణిమూర్‌లో మూడు నెలలుగా జరుగుతున్న మారణహోమాన్ని బయటకు తెలియనివ్వకుండా అక్కడ ఇంటర్‌నెట్ నిలిపివేసి, మీడియాను కట్టడి చేసి ఉగ్రమూకల ఆకృత్యాలకు మరింతగా ఆజ్యం పోస్తున్నారని ఆరోపించారు. 2024లో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే మణిపూర్‌లో ఏం జరుగుతోందో దేశవ్యాప్తంగా అదే జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.